క్లుప్తంగా

స్ట్రెచర్, వీల్‌చైర్ విరాళం



దాతలను అభినందిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు దాతలు స్ట్రెచర్, వీల్‌చైర్‌ను విరాళంగా అందజేశారు. ఆసుపత్రిలోని గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో గత నెల చికిత్స పొందిన బెక్కం వెంకట ప్రసాద్ జ్ఞాపకార్థం ఆయన స్నేహితులు వాటిని శుక్రవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుకు అందించారు. వీటిని ఆసుపత్రిలోని ఎమర్జెన్సీ విభాగాలకు అందించనున్నట్లు ఆయన తెలిపారు హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్, బ్లడ్‌బ్యాంక్ కౌన్సిలర్ కిరణ్, షానవాజ్, షేక్షావలి, దేవరాజు, జగదీష్, లక్ష్మన్న, రాజు ఉన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దు



స్టిక్కర్లను అతికిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): నగరంలోని 23వ వార్డు శ్రీరామనగర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో అదానీ 'స్మార్ట్ మీటరు వద్దు.. పాత మీటరే ముద్దు' కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం సీపీఎం నాయకులు ఆర్.నరసింహులు ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి అదానీ స్మార్ట్ మీటరు వద్దంటూ స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చాక కరెంట్ చార్జీలు విపరీతంగా పెరిగాయన్నారు. గతంలో రూ.500 వచ్చే బిల్లు ఇప్పుడు రూ.1000 అయ్యిందన్నారు. స్మార్ట్ మీటరు వస్తే ఆ బిల్లు రూ.2 వేలు అవుతుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లో అదానీ స్మార్ట్ మీటర్లను అనుమతించబోమని చెప్పారు. కార్యక్రమంలో శేషంరాజు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించండి



వీకర్ సెక్షన్ కాలనీలో దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): నగరంలోని కాలనీల్లో సరైన మౌలిక వసతులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సీపీఎం వార్డుల పర్యటనకు శ్రీకారం చుట్టింది. శుక్రవారం సీపీఎం నాయకులు వై.నగేష్, సీహెచ్ సాయిబాబా తదితరుల ఆధ్వర్యంలో 37వ వార్డు సూర్యనారాయణ నగర్, కృష్ణానగర్, ఐటీసీ, ఖండేవీధి, బుధవారపేట, వీకర్ సెక్షన్ కాలనీల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఏ వీధిలో చూసినా రోడ్లు, డ్రెయినేజీలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమలు విపరీతంగా వృద్ధి చెందడంతో రోగాల బారిన పడుతున్నారని చెప్పారు. మరోవైపు కుక్కల బెడద కూడా అధికంగా ఉన్నట్లు చెప్పారు.

లెఫ్ట్ పార్టీకి ప్రజలు 'గో బ్యాక్' చెప్పారు



మాట్లాడుతున్న వినూషారెడ్డి

కర్నూలు కల్చరల్: ప్రజలు ఇప్పటికే లెఫ్ట్ పార్టీకి నిజమైన 'గో బ్యాక్' చెప్పారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వినూషా రెడ్డి విమర్శించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. సీపీఐ నాయకుడు రామకృష్ణ 'గో బ్యాక్ మోదీ' ర్యాలీ చేస్తామని చెప్పడం చూస్తే వామపక్షాలు నిజంగా ఏం కోరుకుంటున్నారని ప్రశ్నించారు. గో బ్యాక్ అభివృద్ధి, గో బ్యాక్ మౌలిక సదుపాయాలు, గో బ్యాక్ పన్ను తగ్గింపు, గో బ్యాక్ భారతీయ సంస్కృతి పరిరక్షణనా అని ప్రశ్నించారు. కేవలం కేరళలలో మాత్రమే రాజకీయంగా వారు మిగిలారన్నారు. కేరళ ఆర్థిక పరిస్థితి దివాళా స్థితిలో ఉందని, ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు చెల్లించలేకపోతున్నారని, బ్యాంకులు అప్పులు ఇవ్వడానికి వెనుకాడతున్నాయన్నారు.

ఆరోగ్యశ్రీ నిధులు విడుదల చేయాలి

కర్నూలు(సెంట్రల్): రాష్ట్రంలోని ప్రైవేట్ ఆసుపత్రులకు తక్షణమే ఆరోగ్యశ్రీ పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఎన్నో గొప్పలు చెప్పి అధికారంలోకి వచ్చాక పేదల వైద్యానికి సంబంధించి ఆరోగ్యశ్రీ బకాయిలను పెండింగ్‌లో పెట్టడం తగదన్నారు. ఆసుపత్రుల యజమానులు అప్పులు చేసి ఆరోగ్యశ్రీ నిధుల కోసం వేచి చూస్తున్నారని, వాటికి వడ్డీలు కట్టలేక తీవ్రంగా మథన పడుతున్నారని చెప్పారు. ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న సత్యకుమార్ మాటలు మాత్రం విచిత్రంగా ఉన్నాయని, నిధులు విడుదల చేయమంటే ఆయన సోది చెబుతున్నట్లు మండిపడ్డారు. ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ చేస్తున్న ఆందోళనలకు సీపీఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ప్రకటించారు.

కాలనీల్లో సమస్యల తిష్ట



రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



రోడ్డుకు అడ్డంగా వదిలిన మట్టి కుప్పలు



స్పీడ్ బ్రేకర్‌లా కనిపిస్తున్న మట్టి దిబ్బ

కల్లూరు: కల్లూరు అర్బన్ 19వ వార్డులో సమస్యలు తిష్టవేశాయి. గణేష్ నగర్, రామ్‌నగర్ తదితర కాలనీల్లో మట్టి రోడ్లు దర్శనమిస్తున్నాయి. సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ఈ చిత్రంలో కనిపిస్తున్న దృశ్యాలు గణేష్‌నగర్, రామ్ నగర్‌లోనివి. మట్టి రోడ్డు కావడంతో గుంతలమయంగా మారింది. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల రోడ్డుపై నీరు నిలిచి ఉంటోంది. ఇదే రోడ్డులో కొంత దూరం ప్రయాణిస్తే ఎర్రమట్టి కుప్పలు వేశారు. ఇవి రోడ్డుకు అడ్డంగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మట్టి కుప్పలు వేసి సుమారుగా నెల రోజులకు పైగా అవుతుందని కాలనీ వాసులు చెబుతున్నారు. అలాగే రామ్ నగర్‌లో అభయాంజనేయ స్వామి దేవాలయం సమీపంలో రోడ్డు స్పీడ్‌బ్రేకర్ కన్నా ఎక్కువ ఎత్తులో ఉండడంతో రాత్రి సమయంలో ద్విచక్ర వాహనదారులు కిందపడి గాయాలపాలు కావాల్సి వస్తోంది. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై ప్రజా ఉద్యమం



కోటి సంతకాల సేకరణ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కోట్ల హర్ష, ఆదిమూలపు సతీష్ తదితరులు

- పేదలకు వైద్య విద్యను దూరం చేసేందుకు చంద్రబాబు కుట్ర
- కోటి సంతకాల సేకరణ పోస్టర్లను ఆవిష్కరించిన కోట్ల హర్ష, ఆదిమూలపు సతీష్

కోడుమూరు రూరల్: పేదలకు నాణ్యమైన వైద్యం, వైద్య విద్యను ఉచితంగా అందుబాటులోకి తేవాలన్న సంకల్పంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తన హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా 17 ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణం చేపడితే, ప్రస్తుత సీఎం చంద్రబాబు ప్రైవేటీకరణ పేరుతో వాటిని పేదలకు దూరం చేసేందుకు కుట్ర పన్నారని వైఎస్సార్‌సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, విమర్శించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా శుక్రవారం కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమ కార్యక్రమం పోస్టర్లను కర్నూలులో కోట్ల హర్ష, సతీష్ స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో 17 ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుడితే సీఎం చంద్రబాబు వాటిని పూర్తి చేయలేక పీపీపీ విధానంలో ప్రైవేట్ పరం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు కోటి సంతకాల సేకరణకై పార్టీ నాయకులు, కార్యకర్తలంతా నడుం బిగించాలని పిలుపునిచ్చారు. నేటి నుంచి 45 రోజుల పాటు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, వార్డుల్లో రచ్చబండ కార్యక్రమం ఏర్పాటు చేసి మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించి సంతకాలు సేకరించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ కోడుమూరు, కర్నూలు నియోజకవర్గాల అబ్జర్వర్ కర్ర హర్షవర్ధన్‌రెడ్డి, గూడూరు జెడ్పీటీసీ సభ్యుడు మౌలాలి, కర్నూలు మండలాధ్యక్షులు మోహన్‌బాబు, నియోజకవర్గ యూత్ వింగ్ అధ్యక్షుడు ఎంకె.వెంకటేష్, సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు గిరిప్రసాద్, కార్యదర్శి మధుసూదన్, రైతు విభాగం అధ్యక్షుడు నరసింహులు, ఆయా మండలాల నాయకులు, సర్పంచు లోకేష్, రేమట సంపత్‌కుమార్, వెంకటేశ్వర్లు, గోపాల్, కొండారెడ్డి, మహానంది తదితరులు పాల్గొన్నారు.

కోమాలోంచి బయటపడిన చిన్నారి

కర్నూలు(హాస్పిటల్): తీవ్ర జ్వరంతో కోమాలోకి వెళ్లిన చిన్నారి కర్నూలులోని కిమ్స్ హాస్పిటల్ వైద్యులు అందించిన వైద్యంతో తిరిగి సాధారణ స్థితికి చేరుకుంది. వివరాలను శుక్రవారం ఆసుపత్రి పీడియాట్రిక్ న్యూరాలజిస్టు డాక్టర్ శ్వేత రాంపల్లి వెల్లడించారు. వైఎస్సార్ జిల్లా సుద్దపల్లికి చెందిన ఏడాదిన్నర వయస్సున్న చిన్నారి తల్లిదండ్రులది మేనరికపు వివాహం. చిన్నారికి గత నెల 7వ తేదీ నుంచి జ్వరం వచ్చింది. ఆహారం సరిగ్గా తీసుకోకపోవడం, నీరసంగా ఉండటం, తరచూ వాంతులు అవుతూ చివరకు ఫిట్స్ కూడా వచ్చాయి. దీంతో తల్లిదండ్రులు బాబును గత నెల 10వ తేదీన కిమ్స్ హాస్పిటల్‌లో చేర్పించారు. అవసరమైన వైద్యం అందించగా చిన్నారి కోలుకుంది. డాక్టర్ శ్వేత మాట్లాడుతూ.. ఇది అరుదైన ప్రైమరీ కార్నిటైన్ డెఫిషియెన్సీ అనే జన్యుపరమైన సమస్య అన్నారు. ఈ సమస్య 40 వేల నుంచి 1.20 లక్షల మంది పిల్లల్లో ఒకరికి మాత్రమే వస్తుందన్నారు.

జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): అనంతపురంలో 13, 14, 15 తేదీల్లో జరిగే ఐద్వా రాష్ట్ర 16వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.నిర్మల పిలుపునిచ్చారు. శుక్రవారం రాష్ట్ర మహాసభల విజయవంతం కోసం ఐద్వా ఆధ్వర్యంలో వివిధ కాలనీల్లో జెండావిష్కరణలు జరిగాయి. నేతాజీ హౌసింగ్ కాలనీలో పి.రేవతి అధ్యక్షతన కె.పద్మావతి, ఇందిరాగాంధీ నగర్‌లో కుమారి అధ్యక్షతన పి.నిర్మల, వీకర్ సెక్షన్ కాలనీలో శ్యామల ఆధ్వక్షతన వి.లత జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర మహాసభల్లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై తీర్మానాలు చేయనున్నట్లు చెప్పారు. ముఖ్యంగా బెల్టు షాపులు తొలగించాలని, మహిళలకు రక్షణ కల్పించాలనే తీర్మానాలు ఉంటాయన్నారు. జిల్లా మాజీ కార్యదర్శి అలివేలు పాల్గొన్నారు.

నిలిచిన ఏపీజీబీ సేవలు

వెల్దుర్తి: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ సేవలు శుక్రవారం పూర్తిగా నిలిచిపోయాయి. ఈ అంతరాయం సోమవారం వరకు కొనసాగనుంది. ఈ ఏడాది మే 1న ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, గ్రామీణ వికాస్ బ్యాంక్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్‌లు విలీనమై ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌గా ఏర్పడిన విషయం తెలిసిందే. కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్స్ అనుసంధానంలో భాగంగా జరిగే సాంకేతిక ప్రక్రియ కారణంగా శుక్రవారం నుంచి సోమవారం వరకు సేవలను పూర్తిగా నిలిపి వేస్తున్నట్లు బ్రాంచ్ మేనేజర్ ఆంజనేయులు తెలిపారు.

ఆర్టీసీ వాహనం డీజిల్ విక్రయం

- ఇద్దరు డ్రైవర్లను పట్టుకున్న కర్నూలు విజిలెన్స్ అధికారులు

యాడికి: మండలంలోని వేములపాడు సమీపంలో లేబై వద్ద కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపోకు చెందిన లాజిస్టిక్ వాహనం నుంచి అక్రమంగా డీజిల్ విక్రయిస్తున్న ఇద్దరు డ్రైవర్లను ఆ జిల్లా విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపో నుంచి కడపకు బయల్దేరిన ఆర్టీసీ లాజిస్టిక్ వాహనం శుక్రవారం తెల్లవారుజామున వేములపాడు వద్దకు చేరుకుంది. లేబై వద్ద వాహనాన్ని డ్రైవర్ ఆపి ట్యాంక్ నుంచి 20 లీటర్ల క్యాన్‌లోకి డీజిల్ తీస్తుండగా వెనుకనే అనుసరిస్తూ వచ్చిన కర్నూలు విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. డ్రైవర్ శామ్యూల్‌తో పాటు కార్మికుడు వెంకటేష్‌ను అదుపులోకి తీసుకుని యాడికి పీఎస్‌లో అప్పగించారు. కొంత కాలంగా ఈ తంతు కొనసాగుతోందని, విజిలెన్స్ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో నిఘా వేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు వెల్లడించారు.

శ్రేష్ట ద్వారా స్థానికంగా ప్రవేశాలు కల్పించాలి



ఎంపీ నాగరాజుకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

కల్లూరు: స్కీమ్ ఫర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఫర్ స్టూడెంట్స్ ఇన్ హైస్కూల్స్ ఇన్ టార్గెటెడ్ ఏరియాస్ (ఎస్‌టీపీ శ్రేష్ట) ద్వారా ఇతర రాష్ట్రాల్లో చదివిన విద్యార్థులను స్థానికులుగా పరిగణించాలని కాంగ్రెస్ పార్టీ మాజీ ఎస్సీ సెల్ చైర్మన్ ఎండ్లూరి లాజరస్, పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహరాజు, అరుంధతి ఫౌండేషన్ (తిరుపతి) సభ్యులు ప్రసాద్ కోరారు. అరుంధతి ఫౌండేషన్, ఆధ్వర్యంలో శుక్రవారం కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును స్థానిక కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శ్రేష్ట ద్వారా ఎంపికైన విద్యార్థులకు స్థానికత అంశం నుంచి మినహాయింపునిస్తూ రాష్ట్ర విద్యాసంస్థల్లో ప్రవేశం కల్పించి, ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించేలా మార్గదర్శకాలు జారీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అరుంధతి ఫౌండేషన్ సభ్యులు పక్కీరన్న, ప్రకాష్, ప్రసాద్, విజయభాస్కర్, మాధవరాజు, ప్రవీణ్, శ్రేష్ట విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

'గో బ్యాక్ మోదీ' కార్యక్రమానికి మద్దతు

- సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఎవరికి ఇచ్చారో చెప్పాలి?
- కడప స్టీలు ప్లాంటు ఎప్పుడు ఏర్పాటు చేస్తారని ప్రశ్న



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు శ్రీనివాసులు, అబ్దుల్లా

కర్నూలు(సెంట్రల్): వామపక్షాల ఆధ్వర్యంలో చేపట్టే 'గో బ్యాక్ ప్రధానమంత్రి నరేంద్రమోదీ' కార్యక్రమానికి విద్యార్థి, యువజన సంఘాలు సంపూర్ణ మద్దతు తెలిపాయి. ఈ మేరకు ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఏ, పీడీఎస్‌యూ, ఏఐవైఎఫ్, డీవైఎఫ్ఐ నాయకులు ప్రకటన చేశారు. శుక్రవారం సీఆర్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సోమన్న, సాయికుమార్, ఏఐఎస్ఏ రాష్ట్ర కార్యదర్శి నాగార్జున, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మహేంద్ర, ఏఐడీఎస్ఓ నాయకుడు మల్లికార్జున, ఏఐవైఎఫ్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు శ్రీనివాసులు, అబ్దుల్లా మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలను నెరవేర్చని ప్రధానమంత్రికి కర్నూలులో పర్యటించే అర్హత లేదన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలంటూ మోసం చేసిన నరేంద్రమోదీ ఏ ముఖం పెట్టుకొని జనాల్లోకి వస్తారని ప్రశ్నించారు. కడప స్టీలు ప్లాంటు, విశాఖ ఉక్కు ప్లాంటు ప్రైవేటీకరణ నిలుపుదల చేసిన తరువాత పర్యటించాలన్నారు. మరోవైపు 11 ఏళ్ల పాటు జీఎస్టీ వసూలు చేసి ఇప్పుడు తగ్గించి సంబరాలు చేసుకుంటే సరిపోతుందా అని ప్రశ్నించారు. నరేంద్రమోదీ వైఫల్యాలను ఎండగడుతూ 15వ తేదీన వామపక్షాల ఆధ్వర్యంలో నిర్వహించే గోబ్యాక్ మోదీ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలని కోరారు.

మానసిక సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): మానసిక సమస్యలను నిర్లక్ష్యం చేయరాదని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ సూచించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినం పురస్కరించుకుని శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిరాశతో కూడిన భావాలు కనిపించడం, గుండెదడ, ప్రవర్తనలో లోపం, చదువులో వెనుకబడిపోవడం, రకరకాల భయాలు, నిద్రలేమి, ఆరోగ్య సమస్యలు, అనవసర ఒత్తిడి, భయం, నిరుత్సాహం, ఆత్మవిశ్వాసం కోల్పోవడం లాంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను కలిసి చికిత్స తీసుకోవాలన్నారు. ఆరోగ్యకరమైన మనస్సే ఆరోగ్యమైన సమాజానికి మూలమని తెలిపారు. మానసిక ఆరోగ్య సేవలపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లా క్షయ నియంత్రణాధికారి డాక్టర్ ఎల్.భాస్కర్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, పిల్లల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఉండాలని, నిత్యం సంభాషించుకోవాలన్నారు. మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, పౌష్టికాహారం తీసుకోవడం, సరైన నిద్ర, వ్యాయామాలు చేయాలన్నారు. ఎన్‌సీడీ అధికారి డాక్టర్ మహేశ్వరప్రసాద్, సంచార చికిత్స అధికారి డాక్టర్ రఘు, మానసిక వైద్యులు చైతన్య, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పద్మావతి, కన్సల్టెంట్ సుధాకర్, సోమశేఖర్‌రెడ్డి, డీపీహెచ్‌ఎన్ఓ శారద, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

నిధులు, నీళ్ల ప్రస్తావన లేకుండా మోదీ పర్యటన దేనికో?

- చంద్రబాబుకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి ప్రశ్న



మాట్లాడుతున్న కె.ప్రభాకరరెడ్డి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లా పర్యటనకు వచ్చే ప్రధానమంత్రి ఎదుట నీళ్లు, నిధుల ప్రస్తావన లేకుండా దేనికోసం సభ నిర్వహిస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.ప్రభాకరరెడ్డి సీఎం చంద్రబాబును ప్రశ్నించారు. రాష్ట్రాభివృద్ధి జరగాలంటే కేంద్రం నిధులు ఇవ్వాలని, అయితే నిధులను అడగకుండా మోదీ భజన చేసేందుకు వందలాది కోట్లు వెచ్చించి సభ నిర్వహించడం దేనికో అని మండిపడ్డారు. శుక్రవారం సుందరయ్య భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. మోదీ పాలనలో ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర నష్టం జరిగిందన్నారు. విభజన హామీలు అమలు కాకపోగా ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాలైన రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని చెప్పి ఇవ్వలేదన్నారు. విశాఖ ఉక్కు ప్లాంటును ప్రైవేటీకరణ చేయబోమని మోదీ చెప్పడం లేదని అయినా మోదీ భజన చేయడం దేనికన్నారు. కడప స్టీలు ప్లాంటును ఎప్పుడు ఏర్పాటు చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కర్నూలులో ఏర్పాటు చేస్తామన్న హైకోర్టు పోయింది, బెంచ్ పోయిందన్నారు. ఓర్వకల్లులో 30 వేల ఎకరాల్లో 10 వేల ఎకరాలను పారిశ్రామికీకరణ కోసం వెచ్చించినా ఒక్క పరిశ్రమను తేలేని ప్రధానికి ఈ ప్రాంత ప్రజలు ఎందుకు స్వాగతం పలకాలని ప్రశ్నించారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాల్సి ఉన్నా ఆ ఊసే లేకపోవడం తీవ్ర అన్యాయమన్నారు. సీపీఎం నాయకులు పీఎస్ రాధాకృష్ణ, పి.నిర్మల, ఎండీ అనంద్ బాబు, జి.రామకృష్ణ, వెంకటేశ్వర్లు, టి.రాముడు, ఎండీ అంజిబాబు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు



ఉద్యోగాలు పొందిన వారితో జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, సీఈఓ నాసరరెడ్డి

కర్నూలు (అర్బన్): ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు అందించే సేవలతోనే మంచి పేరు, గుర్తింపు వస్తుందని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం జిల్లాపరిషత్‌లోని ఆయన ఛాంబర్‌లో కారుణ్య నియామకాల కింద నలుగురికి నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా పరిషత్ పరిధిలో ఏర్పడిన ఖాళీలకు సంబంధించి కారుణ్య నియామకం కింద వారి అర్హతల మేరకు ఉద్యోగాలు కల్పించి సాధ్యమైనంత వరకు వారికి అనుకూలమైన ప్రదేశాల్లోనే పోస్టింగ్ ఇస్తున్నట్లు చెప్పారు. జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగాలు పొందినవారు నియమ నిబంధనల మేరకు సేవలందిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఉద్యోగాలు పొందిన వారిలో టైపిస్టులుగా సీజీ దీపక్‌ను పీఆర్(పీఐయూ) నంద్యాలకు, బి.సోమేశ్వరుడును ఎంపీపీ హాలహర్వికి పోస్టింగ్ ఇచ్చారు. అలాగే కార్యాలయ సహాయకులుగా జి.ఓంకారేశ్వర్ యాదవ్‌ను ఎంపీపీ ఆత్మకూరుకు, జి.వినాయక్ యాదవ్‌ను ఎంపీపీ జూపాడుబంగ్లాకు నియమించారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

వెల్దుర్తి: మండలంలోని బోయనపల్లె గ్రామంలో గత ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ ఇంట్లో వంట గ్యాస్ లీకై చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో వడ్డె నాగరాజు, సువర్ణ దంపతులు, వారి ఇద్దరు పిల్లలు తీవ్రగాయాల పాలైన సంగతి తెలిసిందే. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వడ్డె నాగరాజు(50) కోలుకోలేక శుక్రవారం మృతి చెందాడు. భార్య, పిల్లల పరిస్థితి సైతం విషమంగా ఉన్నట్లు బాధితుల బంధువులు తెలిపారు.

బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శరత్‌కుమార్

కర్నూలు కల్చరల్: నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవడంలో రాయలసీమ యూనివర్సిటీ అధికారులు విఫలమయ్యారని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శరత్‌కుమార్, ఏఐఎస్ఏ రాష్ట్ర కార్యదర్శి నాగార్జున విమర్శించారు. శుక్రవారం వర్సిటీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలు, ఎన్‌సీటీఈ నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తున్న కళాశాలలను తక్షణమే సీజ్ చేసి, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దశల వారీ ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. యూనివర్సిటీ నాయకులు అలీ, ప్రశాంత్, విఘ్నేష్, నజీర్, వీర లింగ, రాము, మధు, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూ వీసీకి వినతి

ధనార్జనే ధ్యేయంగా నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని, సౌకర్యాలు లేని కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ వి.వెంకట బసవరావుకు వినతి పత్రం అందజేశారు. పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్రబాబు, జిల్లా ఉపాధ్యక్షులు రమణ, నాయకులు సందీప్, ప్రశాంత్, ప్రకాష్, ప్రమోద్, నవీన్ తదితరులు వీసీకి వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

విద్యార్థులను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలి



త్రోబాల్ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు

కర్నూలు (టౌన్): విద్యార్థులను క్రీడాకారులుగా మలిచి తద్వారా ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలన్న దే స్కూల్ గేమ్స్ ముఖ్య ఉద్దేశమని జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు బొల్లవరం రామాంజనేయులు అన్నారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో అండర్-19 స్కూల్ గేమ్స్ సాఫ్ట్‌బాల్, త్రోబాల్ క్రీడాకారులను పరిచయం చేసుకొని ఎంపిక పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నతనం నుండే క్రీడల్లో సాధన చేస్తే వ్యాధులు దరిచేరవన్నారు. రోగాలకు దూరంగా ఉండాలంటే క్రీడల్లో చురుగ్గా పాల్గొనాలన్నారు.